నమ్మండి.. ఇది రోడ్డే!

- భారీ గుంతలు.. మురుగుతో ఇబ్బంది
- రాకపోకలకు అవస్థలు
- ఆందోళనలో విజయరాంపురం గ్రామస్థులు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విజయరాంపురం గ్రామంలో రోడ్లు మురుగు కాలువలను తలపిస్తున్నాయి. సీసీ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో ప్రమాదకరంగా మారాయి. సరుబుజ్జిలి నుంచి విజయరాంపురం, గోనెపాడు మీదుగా బొర్రంపేట వద్ద ఏబీ ప్రధాన రహదారికి లింక్ చేస్తూ గత టీడీపీ ప్రభుత్వ మయాంలో దీన్ని నిర్మించారు. ఇదే సమయంలో విజయరాంపురం గ్రామంలో సీసీ రహదారితో పాటు డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. అయితే డ్రైనేజీల నిర్వహణ లేకపోవడంతో రహదారిపై మురుగునీరు చేరి భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారిలో రాకపోకలు చేసేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. కాగా రోడ్డుపై మురుగునీరు చేరడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన మురుగునీరు

అతివేగం, హెల్మెట్ ధరించకే ప్రమాదాలు

- జిల్లాలో 899 రోడ్డు ప్రమాదాలు.. 285 మంది మృత్యువాత
- ఉప రవాణా కమిషనర్ విజయ సారథి



విజేతలతో డీఆర్వో వెంకటేశ్వరరావు, రవాణాశాఖ అధికారులు తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఉప రవాణా కమిషనర్ విజయసారథి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన కలెక్టరేట్‌లో ప్రమాదాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రహదారి భద్రతపై పలువురు నిపుణులు, అధికారులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ ఏడాది జిల్లాలో 889 రోడ్డు ప్రమదాలు జరుగగా అందులో 285 మంది మరణించారు. 1043 మంది గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ విజయసార థి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరింత కఠినంగా నిబంధనలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. భద్రతా మాసోత్సవాలు సంద ర్భంగా జిల్లాలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సమీక్షలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణ, జిల్లా ఫైర్ అధికారి మోహనరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పీవీ గంగాధర్, ఆర్.అనిల్, మున్సిపల్ ఇంజనీర్లు దక్షిణామూర్తి, ఎన్‌వైకే కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, రవాణా శాఖ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి బంగారు ఆభరణాల అప్పగింత



బాధితుడికి బంగారు ఆభరణాలు అందిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన నిమ్మన మురళీ గణేష్ శనివారం బస్సులో శ్రీకాకుళం వచ్చాడు. ఈ క్రమంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిగి ఓ ఆటోలో రామలక్ష్మణ జంక్షన్ వద్ద దిగాడు. ఆ ఆటోలో ఐదు తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయాడు. దీన్ని గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ పి.ఈశ్వరరావు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించారు. ఆ ఆటో ఆమదాలవలసలో ఉన్నట్లు తెలుసుకున్నారు. కొద్ది సేపట్లోనే అక్కడకు చేరుకుని ఆటోను పట్టుకుని అందులో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడు మురళీ గణేష్‌కు ఆ బ్యాగును అందజేశారు. బంగారం పోయిన గంటలోనే పోలీసులు తిరిగి ఇప్పించడంతో బాధితుడు ఆనందం వ్యక్తం చేశారు.

క్రికెటర్ జున్నారావుకు అరుదైన అవకాశం

- మెక్‌గ్రాత్ కోచింగ్‌లో పాల్గొనాలని పిలుపు



కోచింగ్‌కి ఎంపికైన జున్నారావు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం, ఫాస్ట్‌బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ వచ్చే నెల 13 నుంచి 16వ తేదీ వరకు చెన్నైలో కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ క్యాంప్‌లో పాల్గొనే అవకాశం జిల్లాకు చెందిన క్రికెటర్ రాజాన జున్నారావుకు అవకాశం లభించినట్టు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి పిలుపువచ్చింది. రాష్ట్రం నుంచి ఇద్దరికి అవకాశం రాగా తూర్పుగోదావరి జిల్లాకు సత్యనారాయణ రాజు ఒకరు కాగా, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం అల్లుకోల గ్రామానికి చెందిన జున్నారావు మరొకరు. పేద కుటుంబానికి చెందిన జున్నారావు క్రికెట్‌పై మక్కువతో తర్ఫీదు పొందుతూ ఫాస్ట్‌బౌలర్‌గా రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వన్‌డే పోటీల్లో రాణించి సెలక్టర్లను ఆకరించాడు. జున్నారావుకి ఈ అవకాశంపై జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎన్ శాస్త్రి, హసన్ రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, ట్రెజరర్ షైలానీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన రామాలయ ప్రారంభోత్సవాలు

జి.సిగడాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నాగులవలసలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవాలు శనివారం ఘనంగా ముగిసింది. సీతారామ మందిర ప్రారంభోత్సవం వైభంగా సాగింది. సీతారాముల చిత్ర పటాలను, రాగితో తయారు చేసిన చెట్టు, ఆలయ శిఖరం వంటి వాటిని గ్రామ పురోహితులు భమిడిపాటి శంకర్ దయాల్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠింపజేశారు. సీతారాములు కల్యాణం కనులపండువగా జరిపారు. కల్యాణంలో పలు దంపతులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కంచిలి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రాధాకృష్ణ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, సహస్రనామ పారాయణం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు.

- కవిటి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగ గ్రామంలోని శ్రీచక్ర పెరుమాళ్ల స్వామి మూలవిరాట్‌లు ఏర్పాటు చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

అటెండెన్స్ లాక్ చేయడం సరికాదు

గుజరాతీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు సాయంత్రం ఐదు గంటలకే ముగింపు సమయం అయినా.. 5.30 గంటల వరకు ఉన్నా అటెండెన్స్ పడకుండా లాక్‌చేయడం సరికాదని ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు బి.రవి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సుదూర ప్రాంతాల నుంచి హాజరైన ఉపాధ్యాయులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, అటువంటి సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురికావల్సి వస్తోందన్నారు. కాంప్లెక్స్ మీటింగ్‌తో ఐదు గంటల వరకు పెంచడమే కాకుండా అటెండెన్స్ పడకుండా చేయడం అమానుషమని, దీనిపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై అధికారులు చొరవచూపి, సాయంత్రం నాలుగు గంటలకు క్లస్టర్ సమావేశాలు పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేయండి

అరసవల్లి/గుజరాతీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శనివారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గల ఆర్‌ఐవో కార్యాలయంలో సమీక్షించారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బెంచీలు, కుర్చీలు, విద్యుత్తు సౌకర్యం, ప్రథమ చికిత్సా, రవాణా ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద చేస్తున్న ఏర్పాట్లు వివరాలను ఆర్‌ఐవో దుర్గారావు తెలియజేశారు. కార్యక్రమంలో పరీక్ష కమిటీ సభ్యులు భీమేశ్వరరావు, నారాయణరావు, సింహాచలం, శ్యామ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, ఎం.వాసుదేవ కుమార్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 'తాండ్ర'

ఆమదాలవలస, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడిగా తాండ్ర జనార్దనరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల కమిటీ సభ్యులు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సేవా సంఘం తరఫున ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వగా గడువులోగా ఒకే నామినేషన్ దాఖలైందన్నారు. దీంతో తాండ్ర జనార్దనరావు ప్యానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించి వారికి డిక్లరేషన్ ఫారాలు అందించినట్టు ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పైడి సూర్యారావు, జనరల్ సెక్రటరీగా నానుపాత్రుని రామారావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు ఉన్నట్టు ప్రకటించారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా రిటైర్డు లెఫ్టినెంట్ కల్నల్ పీఎస్ రావు, రిటైర్డు సుబేదార్ గురుగుబిల్లి సత్యనారాయణ, రిటైర్డు సుబేదార్ మేజర్ బర్రి సంజీవరావు, హానరీ కెప్టెన్ జామి రమణయ్య వ్యవహరించారు.

థర్మల్ పవర్ ప్లాంట్‌తో జిల్లాకు తీవ్రనష్టం

అరసవల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణానికి, ప్రకృతి వనరులకు తీవ్ర నష్టం సంభవిస్తుందని, దీంతో సహజ వనరులకు ఆలవాలమైన జిల్లా తీవ్ర నష్టం చవిచూడవలసి వస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త వాబ యోగి అన్నారు. ప్లాంట్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా సంఘాలతో స్థానిక ఎన్జీవో హోమ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో చాపర వెంకటరమణ, భవిరి కృష్ణమూర్తి, అంబటి కృష్ణమూర్తి, కేవీ జగన్నాథం, చింతాడ రవికుమార్, తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి



బెంచీలకు పెయింటింగ్ వేస్తున్న కమిషనర్, హెల్త్ అధికారి



వర్సిటీలో నిర్వహించిన స్వచ్ఛంద్రా కార్యక్రమంలో పాల్గొన్న వీసీ రజని తదితరులు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని నగరపాలక కమిషనర్ పీవీవీ ప్రసాదరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీనెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నగరంలో తెలుగు ముసలయ్య కాలనీలో ఉన్న పార్క్‌ను కమిషనర్, హెల్త్ అధికారి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు కలిసి శభ్రం చేశారు. అలాగే పార్క్‌లో ఉన్న బెంచీలకు, బొమ్మలకు కమిషనరే స్వయంగా పెయింటింగ్స్ వేశారు. అనంతరం ఉద్యోగులతో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు.

ఆదిత్యాలయంలో..

అరసవల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో భద్రాజీ ఆధ్వర్యంలో సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సిబ్బంది శ్రీనివాసరావు, నీలయ్య, భక్తులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న ఈవో భద్రాజీ తదితరులు

అంబేడ్కర్ వర్సిటీలో..

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం స్వచ్ఛంద్రా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. వర్సిటీలో మొక్కలు నాటి, రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, ఎన్ ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

గస్తీ విధులపై అప్రమత్తంగా ఉండాలి



తనిఖీ చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఆమదాలవలస, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది గస్తీ విధుల పై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం వేకువజామున పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో రాత్రి పహారా కాసే సిబ్బంది స్టేషన్ పరిధిలో రాత్రి బీట్ కాసే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది రాత్రిపూట తిరిగే బీట్ పాయింట్లపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి చిన్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సనపల బాలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత



ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్‌కు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ అన్నారు. ఆర్టీసీ శ్రీకాకుళం-1 డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన శ్రీకాకుళం, పలాస, టెక్కలి డిపోల్లో ఎక్కువ కాలం పనిచేసి ప్రమాదరహిత డ్రైవర్లుగా ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీవో ఎంఎస్ఎం రాజు, శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద పాల్గొని ఆర్టీసీ డ్రైవర్ల సేవలను కొనియాడారు. ఆరోగ్యం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-1, 2 డిపో మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్ శర్మ, టెక్కలి, పలాస డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కార్మిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సర్వే పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న

పొందూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు దివ్యాంగులకు అందేలా పక్కాగా సర్వే చేపట్టాలని పొందూరు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. దివ్యాంగుల సర్వేపై పొందూరు, జి.సిగడాం మండలాల వివిధ శాఖల సిబ్బందితో కోర్టు సమావేశ భవనంలో సమీక్షించారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి, శ్రీకాకుళం, గార, నగరంలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

చిన్నారుల సంరక్షణకు జేజేబీ బోర్డు



మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ, సంక్షేమం కోసం జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ) బోర్డు పనిచేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం వివిధ శాఖల అధికారులు, పోలీ సు అధికారులతో సమావేశం నిర్వహించారు. మొదటి అడిషనల్ జూ నియర్ సివిల్ జడ్జి మొహిద్దీన్ జమరుత్ బేగం కమలుద్దీన్, డీసీపీవో కేవీ రమణ, ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేశ్వరరావు, పోలీసు అధికారులు, అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు. కాగా కోర్టుల సముదాలయంలో శనివారం జరిగిన ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లో భాగంలో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ దగ్గర నుంచి 12 కేసులు రాజీ చేశారు.

పరిశోధన రంగంలో సేవలందించనున్న జెమ్స్



ఒప్పందం కుదుర్చుకున్న జెమ్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో నిరంతర సేవలందిస్తూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జెమ్స్ మెడికల్ కళాశాల ఇప్పుడు పరిశోధన రంగంలో కూడా సేవలందించనున్నట్టు జెమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కర్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఏఎంటీజెడ్ఎస్ వ్యాసా బెంగుళూరు యూనివర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకున్నట్టు ఆయన తెలిపారు. పరిశోధన రంగంలో కూడా వైద్య విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం కొత్త వైద్య విధానాలు రూపొందించి సమాజానికి తమ వంతు సేవలందిస్తామని చెప్పారు.

అవయవదానంపై అవగాహన

గుజరాతీపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అవయవదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవయవదానంపై అవగాహన లేక చాలమంది ముందుకు రావడం లేదన్నారు. అవయవదానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అవయవదానంతో ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. రెడ్‌క్రాస్ మేనేజర్ జి.రమణ తదితరులు ఉన్నారు.



సైకిల్ యాత్ర చేస్తున్న ఇటలీ దేశస్థురాలు ఎమ్మాఎన్‌గ్రేసియా

భారతీయ సంస్కృతి గొప్పది

కవిటి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని ఇటలీ దేశస్థురాలు ఎమ్మాఎన్‌గ్రేసియా అన్నారు. కోల్‌కత్తా నుంచి కేరళ వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్రలో భాగంగా శనివారం కవిటి మండలంలోని బైరిపురం చేరుకొని రాత్రిబస చేశారు. విభిన్న దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు తెలుసుకునేందుకు సైకిల్ యాత్ర చేస్తున్నానన్నారు. కోల్‌కత్తాలో ప్రారంభించిన ఈ యాత్ర ఇప్పటికే 951 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించానన్నారు. మరో 1800 కిలోమీటర్లు యాత్ర చేయనున్నానని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో మహిళలు కట్టుబొట్టుతో పాటు ఆయా ప్రాంతాల విశేషాలు తెలుసుకొంటున్నానని తెలిపారు. సముద్ర తీరప్రాంతంలో నివాసప్రాంతాలు ఎంతో అందంగా ఉన్నాయన్నారు.

భారీ బందోబస్తు

గార, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వత్సవలస రాజమ్మ జాతరకు 140 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ ఆర్.జనార్దన్ తెలిపారు. సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో నలుగురు ఎస్‌ఐలతో 140 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శని, ఆదివారాల్లో జరుగుతున్న ఈ యాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వాహనాలు పార్కింగ్, ట్రాఫిక్ తదితర వాటిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం ఉదయం భక్తులు సముద్ర స్నానాలు చేయనుండడంతో అక్కడ మెరైన్ సీఐ ప్రసాదరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిష్కారానికి చర్యలు

జి.సిగడాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన గ్రామ, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష అన్నారు. శనివారం రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను ఆమె పరిశీలించారు. మండలంలో 31 పంచాయతీల నుంచి సుమారు 1028 వినతులు వచ్చాయని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, డీటీ ఎం. నిర్మల, సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.

ఓం నమో భగవతే.. వాసుదేవ పెరుమాళ్!

● రేపటి నుంచి మందస వాసుదేవుడి బ్రహ్మోత్సవాలు

● వారం రోజులపాటు నిర్వహణకు ఏర్పాట్లు



ఎలా చేరుకోవాలంటే..

శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే బస్సులు ఎక్కి హరిపురంలో దిగాలి. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు ఎక్కి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస వాసుదేవుడి ఆలయానికి చేరుకోవచ్చు. రైళ్లలో వచ్చేవారంతా పలాస రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడ నుంచి మందస ఆర్టీసీ బస్సులపై నేరుగా వాసుదేవుడి ఆలయానికి చేరుకోవచ్చు.

మందసలోని వాసుదేవ ఆలయం

హరిపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):

తూర్పుకనుమల్లోని మహేంద్రగిరుల పాదభాగాన మందసలో వెలసిన అతి ప్రాచీన ఆలయం.. శ్రీవాసుదేవ పెరుమాళ్ దేవాలయం. అద్భుత శిల్పకళా వైభవంతో అలరాలుతూ.. నిత్యం వేద పండితుల గోష్ఠులతో ఈ ఆలయం శోభిల్లుతోంది. కాశీలో ఉన్న కొంతమంది వేద పండితులు ఇక్కడే శ్రీభాష్య అధ్యయనం సాగించారు. ఇక్కడ కొలువైన వాసుదేవుడికి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ నెల 17 నుంచి 23 వరకూ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సుమారు పదిలక్షలకుపైగా భక్తులు తరలిరానున్నారు. ఈ మేరకు సేవాసమితి సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కిలోమీటర్ల మేర బారికేడ్లు, క్యూలైన్లు సిద్ధం చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు సమకూర్చనున్నారు. ఆలయ పునరుద్ధరణ సమయంలోనే పట్టణంలోని యువకులు.. శ్రీరామనుజ యువజన సేవా సంఘం, శ్రీమన్నారాయణ యువజన సేవా సంఘాలుగా ఏర్పడ్డారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్వామికి సేవచేస్తూ పునీతులవుతున్నారు.

శతాబ్దాల చరిత్ర..

మందస సంస్థాన రాజులు ఈ ఆలయాన్ని ఒడియా సంప్రదాయమైన పూరి జగన్నాథస్వామి ఆలయ నిర్మాణ పోలికలతో నిర్మించారు. కాంచీపురంలో వాసుదేవుని ప్రతిమను తయారు చేయించి ఇక్కడ ప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణానికి ఒడిశాలోని ప్రసిద్ధి గాంచిన కోణార్క్ ప్రాంతం నుంచి రాయిని తెప్పించి వినియోగించారు. ఆలయం లోపల వెలుపలా ప్రాచీన శిల్పాలు జీవకళ ఉట్టిపడేలా కనిపిస్తూ భక్తులకు ఎంతగానో ఆకర్షిస్తాయి. ప్రాచీన నాగరికతను తలపించేలా వివిధ భంగిమలతో అమర్చిన రాతి బొమ్మలు సజీవ మూర్తుల్లా శిల్పకళా శోభితానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ ఆలయం 14వ శతాబ్దం నాటిదని ప్రాచీన రాతి పత్రాలద్వారా అధికారులు గుర్తించారు. కాలక్రమంలో శిథిలం కావడంతో మందస సంస్థానాన్ని పాలించిన రాజపుత్ర వంశీయుల్లో ఒకరైన లక్ష్మణ్ రాజమణి రాజదేవ్ దీన్ని 1744లో పునఃప్రతిష్ఠ చేశారని శిలాశాసనాలు ద్వారా తెలుస్తోంది. నాటి నుంచి ఈ సంస్థానాన్ని పాలించిన వారంతా 1950వరకు ఏటా తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆ తర్వాత రాజులతోపాటు ఆలయాల వైభోగాల ప్రాభవమూ కోల్పోయింది. ఇంత చారిత్రిక ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయాన్ని సంరక్షించుకోవడంలో (మిగతా 8వ పేజీలో..)



వాసుదేవ పెరుమాళ్ మూలవిరాట్..

కార్యక్రమాలు ఇలా..

● ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి.. వాసుదేవుడి ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, వివిధ హోమాలతోపాటు సాయంత్రం వేళ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, యాగశాలలో ద్వారాతోరణ, ధ్వజకుంభారాధన తదితర కార్యక్రమాలు రాత్రి 9 వరకూ నిర్వహిస్తారు.

● 17న ఉదయం 9 గంటలకు శ్రీ ఆంజనేయస్వామి అభిషేక మహోత్సవం, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, తీర్థగోష్ఠి నిర్వహిస్తారు.

● 18న ఉదయం వాసుదేవ పెరుమాళ్ అభిషేక మహోత్సవం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, సేవాకాలం, విష్వక్సేన ఆరాధన నిర్వహిస్తారు. అలాగే లోహరిబంద శ్రీమన్నారాయణ భక్తిబృందం, బి.గొనపపుట్టుగ, మందస మహేంద్ర కళామండలి బృందాలతో సంగీత విభావరి నిర్వహిస్తారు.

● 19న ఉదయం 9 గంటలకు గరుడ పూజ, ధ్వజారోహణం, సాయంత్రం దేవతాహ్వానము, శేషవాహన సేవ. కాశీబుగ్గ వారిచే నృత్యప్రదర్శన, కూచిపూడి నర్తనశాల, బెజ్జిపుట్టుగ చిన్నారి సచల బృందంచే సంగీత విభావరి నిర్వహిస్తారు.

● 20న కల్పవృక్ష వాహన సేవ, లక్ష్మీ పూజ, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, హంస వాహనము, గరుడు వాహన సేవ నిర్వహిస్తారు. బెజ్జిపుట్టుగ శ్రీమాన్ శ్రీనివాసరావు బృందం సంగీత విభావరి, సాయిమెహర్ నృత్య కళానికేతన్ మందస వారిచే నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు.

● 21న యాగశాలలో విశేషహోమములు, 10 గంటలకు శ్రీ వాసుదేవ కళ్యాణ మహోత్సవం, జీయర్ స్వాముల మంగళశాసనములు, సాయంత్రం గరుడు వాహన సేవలో మందస పురవీధుల్లో స్వామి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. పలాస అన్నమయ్య హరి శరణాగతి సమాఖ్యతో అన్నమయ్య సంకీర్తనలు, రాజమండ్రికి చెందిన కుమారి హరిప్రియ కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహిస్తారు.

● 22న యాగశాలలో విశేషహోమములు, పొన్నవాహన సేవ, శ్రీవెంకటేశ్వర స్వామి పూజ, సాయంత్రం తెప్పోత్సవం అశ్వవాహన సేవ, దోపిడీ ఉత్సవం నిర్వహిస్తారు. అన్నమయ్య సంకీర్తనలు, నృత్య ప్రదర్శలు ఏర్పాటు చేశారు.

● 23న ఉదయం రథోత్సవం, చక్రతీర్థం, అవబృదస్నానం, సాయంత్రం ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం నిర్వహిస్తారు. విశాఖపట్నం సప్తస్వర సంగీత కళాశాల వారిచే సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ● ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చాలామంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రికి వినతులు అందజేశారు. కొంతమంది రైతులు సాగునీటి కోసం విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులు.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది.. తమకు కనీస వేతం అమలు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్న భరోసా ఇచ్చారు. అలాగే నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కంచివూరులో శ్మశానవాటిక, సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో మూడు ఇసుక లారీలు సీజ్

రణస్థలం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. శుక్రవారం రణస్థలం మండలం పైడిభీమవరంలోని చెక్‌పోస్టు వద్ద జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం సాయంత్రం 28 ఇసుక లారీలను తనిఖీ చేయగా.. అందులో 12 వాహనాలకు సంబంధించి నకిలీ ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్టు గుర్తించిన వివషయం తెలిసిందే. తాజాగా శనివారం మరో మూడు లారీలు ఇసుక అక్రమ రవాణా చేస్తూ.. పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డాయని జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. నకిలీ బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించిన ఆ మూడు లారీలను సీజ్ చేశామన్నారు. చెక్‌పోస్టు వద్ద పటిష్ఠమైన భద్రతతో వాహనాలు తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

ఉపాధి ఇచ్చిన వాహనమే ఉసురు తీసింది

● బెలమాంలో ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి 8లో

గంజాయి గుట్టురట్టు

● పోలీసులు దాడులు చేస్తున్నా.. ఆగని అక్రమ రవాణా

● ఒడిశా నుంచి జిల్లా మీదుగా ముంబై, తమిళనాడుకు తరలింపు

● పలాస, మందస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలో పట్టుబడిన నిల్వలు

● మొత్తంగా ఏడుగురు అరెస్టు.. పరారీలో మరికొందరు

పోలీసులు ఎన్ని దాడులు చేస్తున్నా.. గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు. ఒడిశా రాష్ట్రం నుంచి జిల్లా మీదుగా గంజాయి ముంబై, తమిళనాడు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందుకోసం గంజాయి ముఠా సభ్యులు రైల్వే మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు రైల్వేస్టేషన్లల్లో ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉదయం పలాస, మందస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలో గంజాయి నిల్వలు పట్టుబడ్డాయి. మొత్తంగా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొంతమంది కోసం గాలిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో గంజాయి నివారణకు చర్యలు చేపడుతున్నామని, ముఠా సభ్యులు వదిలిపెట్టేది లేదంటూ కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు స్పష్టం చేశారు.

పలాస, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో శనివారం మూడు గంటల వ్యవధిలో రెండు వేర్వేరు కేసులకు సంబంధించి 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు ఒడిశా వాసులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉండగా ముంబైలో ఉన్న గంజాయి కొనుగోలు దారుడి కోసం గాలిస్తున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో.. ఒడిశా రాష్ట్రం పట్టుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన విక్రమ్ మండల్, సునందన్ సబర్‌లు 8 కిలోల గంజాయి ప్యాకెట్లను ముంబై తరలిస్తుండగా సాధారణ తనిఖీల్లో ఉన్న కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణకు పట్టుబడ్డారు. దీనిపై సీఐ ఆరా తీయగా.. 'ఒడిశా రాష్ట్రం బుర్రైపహడా గ్రామానికి చెందిన జోరషిమాన్ (గంజాయి పండించిన వ్యక్తి) వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేశాం. ముంబైలో నివాసం ఉంటున్న ఒడిశాకు చెందిన జాఫర్‌కు గంజాయి అందిస్తుంటాం. అక్కడ తమకు డబ్బులు ఇస్తారని విక్రమ్ మండల్, సునందన్‌సబర్ తెలిపారు. ఈ మేరకు వారిద్దరి కోసం కూడా గాలిస్తున్నామని డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు.

● అదే రోడ్డులో తనిఖీలు ముమ్మరం చేయగా.. మధ్యాహ్నం 2.30గంటల సమయంలో గండాహతి(ఒడిశా) గ్రామానికి చెందిన గౌరవ్‌పొరిచ్చా, హైదరాబాద్‌లో ఉంటున్న గంగవైన ఉదయ్‌కుమార్ మూడు కిలోల గంజాయి లగేజీ బ్యాగులో వేసుకొని వెళ్తుండగా సీఐ సూర్యనారాయణకు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేయగా ఈ కేసుకు సంబంధించి మెయిన్, చింటూ అనే వ్యక్తులు పరారీ అయ్యారు. వీరంతా గంజాయి సేవిస్తూ అదే గ్రామంలో ఉండే సబీర్ అనే వ్యక్తితో పరిచయమయ్యారు. సబీర్ గంజాయి పండిస్తు విక్రయిస్తుంటాడు. ఆయన వద్ద గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ప్యాకెట్లుగా విక్రయిస్తామని నిందితులు తెలిపారు.

● డీఎస్పీ మాట్లాడుతూ 'ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయిపై ఉక్కుపాదం మోపే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అన్నీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీములను ఏర్పాటు చేశాం. గంజాయి లేని జిల్లాగా తీర్చిదిద్దుతాం. గంజాయి సేవించినా, అమ్మినా, పండించినా నేరం. అటువంటి వారిని విడిచిపెట్టేది లేదు' అని తెలిపారు. గంజాయి నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ సూర్యనారాయణ, పోలీసులను ఆయన అభినందించారు.



పలాస : గంజాయి నిందితులతో డీఎస్పీ వెంకటఅప్పారావు, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ

- మందస రైల్వేస్టేషన్‌లో.. తమిళనాడు ముఠా

హరిపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మందస రోడ్ రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, సీఐ తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి శుక్రవారం రాత్రి తనిఖీలు చేశారు. ఈక్రమంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు ముఠా సభ్యులు మైఖేల్, రాజరాజన్‌లు 2.6 కిలోల గంజాయితో పట్టుబడ్డారని డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. పలాస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ల నిఘా పెంచటంతో గంజాయి ముఠా సభ్యులు రూటు మార్చారు. చిన్న రైల్వేస్టేషన్లు లక్ష్యంగా గంజాయి అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. దీంతో ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ముఠాసభ్యులు రైలు ద్వారా తమిళనాడుకు తరలించేందుకు మందస రోడ్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు దాడులు చేసి చాకచక్యంగా వారిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా చుడంగపూర్‌కు చెందిన మిలన్ పరిచ్చా.. ముంబైకి 6.22 కిలోల గంజాయి తరలిస్తూ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పోలీసులకు పట్టుబడ్డాడని కాశీబుగ్గ డీఎస్పీ పి.వెంకట అప్పారావు తెలిపారు. మిలన్ పరిచ్చా శనివారం ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయితో బస్సులో బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడ నుంచి గంజాయి మూటలతో బెంగళూరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అనుమానస్పదంగా కనిపించటంతో తనిఖీలు చేయగా అతను వద్ద ఉన్న గంజాయిని గుర్తించి సీజ్ చేశామని డీఎస్పీ తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని ముంబైలో ఉన్న ప్రేమానంద్‌కు అందించేవాడని.. ఒకసారి గంజాయి తీసుకెళ్తే రూ.5వేలు ఇచ్చేవాడని.. తమ దర్యాప్తులో తేలిందన్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సై ముకుందరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడి.. బాధ్యతగా పని చేయండి

● పంచాయతీ సిబ్బందికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

టెక్కలి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'టెక్కలి మేజర్ పంచాయతీ సిబ్బందిలో క్రమశిక్షణ కరువైంది. పారిశుధ్య కార్మికులు హాజరు తీసుకునే విధానం సరికాదు. ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులకు ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు గుర్తించాలి. ఎవరు ఏ విధులకు హాజరవుతున్నారో, ఎవరు గైర్హాజరవుతున్నారో ఎలా గుర్తిస్తారు' అంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వీడి.. బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. శనివారం టెక్కలిలో నిర్వహించిన స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావుతోపాటు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. 'చెత్త తరలించే ట్రాక్టర్ వెనుక ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులు అవసరం లేదు. కార్మికులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలి. వార్డులవారీ పనుల బాధ్యతను అప్పగించి.. పర్యవేక్షణకు ఇతర సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. క్లాప్‌మిత్రలు, రెగ్యులర్, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఏఏ పనులు చేస్తున్నారో నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలి. పారిశుధ్య కార్మికుల విధుల్లో లోపాలు గుర్తించి అవసరమైన సామగ్రి, పరికరాలు అందించాలి. మూడు నెలలకోసారి పారిశుధ్య కార్మికులకు పంచాయతీలో వైద్య పరీక్షలు నిర్వహించాలి' అని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు వంశధార కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చెత్తసేకరణ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా, క్లాప్ మిత్రలు తమకు ఇస్తున్న రూ.6వేల వేతనం కుటుంబ పోషణకు చాలడం లేదని, వేతనాలు పెంచాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీపీవో భారతీ సౌజన్య, ఎంపీడీవో చింతాడ లక్ష్మీభాయి, పంచాయతీరాజ్, వంశధార ఈఈలు సూర్యప్రకాష్, శేఖరరావులు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ డీఈఈలు రామకృష్ణ, సుధాకర్, తహసీల్దార్ రవికుమార్, ఏపీవో ప్రసాద్, ఎంఈవో లక్ష్మునాయుడు, డీఎల్‌పీవో గోపీబాల, ఈవో పీఆర్‌డీ సింహాద్రి ఉన్నారు.

చెత్తను శుభ్రం చేద్దాం.. స్వచ్ఛ నగరాన్ని సాధిద్దాం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చెత్తను శుభ్రం చేద్దాం.. స్వచ్ఛ నగరాన్ని సాధిద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారం కలెక్టర్ బంగ్లాలో ఆయన తడి, పొడి, హానికరమైన చెత్తలను వేరు చేసి కార్పొరేషన్ వాహనంలో వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను మూడు రకాలుగా విభజించి కార్పొరేషన్ సిబ్బందికి అందజేయాలని కోరారు. పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమన్నారు. బంగ్లాలో పనిచేసే సిబ్బందికి తడి, పొడి, హానికరమైన చెత్తలపై అవగాహన కల్పించారు. తడి చెత్త నుంచి ఎరువుల తయారీ, కంపోస్టు, వర్మీ కంపోస్టు తయారు చేస్తారని తెలిపారు. పొడిచెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తామన్నారు. డైపర్స్, శానిటరీ నాప్‌కిన్స్, మందులు, గాజు తదితర హానికరమైన చెత్తను రెడ్ కలర్ డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ప్రతీ ఇంట్లో సాధ్యమైనంత వరకు హోం కంపోస్టు చేయాలని సూచించారు. జిల్లాను స్వచ్ఛ సిక్కోలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, హెల్త్ అధికారి డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.



కార్పొరేషన్ వాహనంలో చెత్తను వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చెరువులో స్కూల్ బస్సు బోల్తా

● ఐదుగురు విద్యార్థులకు గాయాలు

● గ్రామస్థులు స్పందించడంతో తప్పిన ముప్పు 8లో

పెళ్లికి సన్నాహాలు.. ఇంతలోనే విషాదం

● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం 8లో

చెరువులో స్కూల్ బస్సు బోల్తా

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు
- గ్రామస్థులు స్పందించడంతో తప్పిన ముప్పు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

హరిపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని ఉమాగిరి గ్రామం వద్ద విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి చెరువులో బోల్తా పడింది. గ్రామస్థులు సకాలంలో స్పందించి విద్యార్థులను బయటకు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. గాయపడిన ఐదుగురు విద్యార్థులను హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం సాయంత్రం ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు 32 మంది విద్యార్థులతో మందస నుంచి భైరిసారంగపురం, పితాతోళి మీదుగా సిద్ధిగాం, బుడార్సింగి, పెడంగో మార్గంలో వెళ్తుండగా ఉమాగిరి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి చెరువులో బోల్తాపడింది. ఈ ఘటనలో బుడార్సింగి, పెడంగో గ్రామాలకు చెందిన ఎన్.ధీరజ్, ఎన్.లోకేష్, పవిత్ర పట్నాయిక్, హర్షిత, మహేష్‌గౌడ గాయపడ్డారు. వీరిని 108లో హరిపురం ఆసుపత్రికి తరలించగా వైద్యులు స్వరాజ్యలక్ష్మి, ఐశ్వర్య చికిత్స అందించారు. చిన్న గాయాలేనని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే, గ్రామానికి ఆనుకొని ఉండే కోనేరు కావడంతో వెంటనే బస్సు డ్రైవరు, స్థానికుల సాయంతో విద్యార్థులను బస్సు నుంచి బయటకు తీసి ఒడ్డుకు చేర్చారు. సకాలంలో గ్రామస్థులు ఆదుకోవటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాద వివరాలను ఎంఈవో లక్ష్మణరావు ఉన్నతాధికారులకు నివేదించారు.

ఉపాధి ఇచ్చిన వాహనమే ఉసురు తీసింది

- ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి
- బెలమాం వద్ద ఘటన
- తాడివలసలో విషాదం


బోల్తాపడిన ట్రాక్టర్


భాస్కరరావు (ఫైల్)

ఆమదాలవలస/ పొందూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం కొనుగోలు చేసిన ట్రాక్టరే అతడి ప్రాణం తీసింది. కుటుంబపోషణకు అండగా ఉంటుదనుకున్న ట్రాక్టరే ఆ కుటుంబానికి అతడ్ని దూరంచేసింది. పొలం పనుల కోసం ట్రాక్టర్‌పై ఇంటి నుంచి బయలుదేరిన కాసేపటికే అతడ్ని బలితీసుకున్న విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పొందూరు మండలం తాడివలస గ్రామానికి చెందిన తమ్మినేని భాస్కరరావు(54) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబానికి అండగా ఉంటుందని భావించిన భాస్కరరావు ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేసి తన పొలం పనులతోపాటు అద్దెలకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తన పొలంలోనే వ్యవసాయ పనులు చేసేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా.. ఆమదాలవలస మండలం బెలమాం గ్రామ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ కింద భాస్కరరావు చిక్కుకుపోయాడు. సమీపంలో ఉన్నవారు వచ్చి ట్రాక్టర్‌ను తొలగించినా ఫలితం లేకపోయింది. ట్రాక్టర్ కిందపడి ఉన్న భాస్కరరావు మృతదేహం నుజ్జునుజ్జయింది. కాగా అతడికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇరువురు కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. సమాచారం అందుకున్న ఆమదాలవలస ఎస్ఐ సనపల బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా అందరితో కలివిడిగా ఉండే భాస్కరరావు అకాలమృతితో తాడివలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పెళ్లికి సన్నాహాలు.. ఇంతలోనే విషాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


నవీన్ మృతదేహం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెళ్లి సరదా తీరకుండానే ఆ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గతేడాది ఇదే సమయంలోనే తండ్రి చనిపోయాడు. తండ్రి ఉద్యోగం ఓ వైపు రావల్సి ఉండగా, మరో వైపు పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ యువకుడ్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. వివరాల్లోకి వెళితే.. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి గ్రామానికి చెందిన సవర నవీన్ కుమార్ (21).. తనతో పెళ్లి నిశ్చియమైన ఓ యువతితో కలిసి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా.. జాతీయ రహదారి కుశాలపురం బైపాస్ జంక్షన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొనడంతో నవీన్ అక్కడక్కడే మృతిచెందాడు. విజయవాడలో ఉంటున్న ఆ యువతి విశాఖ వచ్చిందని తెలిసి ఆమెను స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ యువతిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి సవర అనప పోలీసు హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో గతేడాది మార్చిలో మృతిచెందాడు. తండ్రి ఉద్యోగం కారుణ్య నియామకం కింద నవీన్‌కుమార్‌కు ఓ వైపు రావల్సిఉండగా, మరో వైపు నిశ్చితార్థం జరిగిన యువతితో వివాహం జరగాల్సిఉంది. ఈ పరిస్థితుల్లో నవీన్‌కుమార్ మృతితో ఆ కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతం. కాగా నవీన్‌కు తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పలాస, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): తిరుపతి-పూరీ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. విశాఖపట్నం వద్ద రైలు ఎక్కిన 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మద్యం తాగి ఉన్నాడని, పలాస స్టేషన్‌కు వచ్చేసరికి మృతి చెందినట్లు ప్రయాణికులు ఫిర్యాదు చేయ డంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నా రు. ఆయనకు చెందిన వివరాలు ఏవీ లభించలేదని, మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టంనకు తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడు..

నందిగాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని పలాస మండలం రేగులపాడుకు చెందిన దాసరి భీమయ్య(75) మృతి చెందాడు. భీమయ్య బోరుభద్ర వెళ్లేందుకు కాలినడకన వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్య తులసమ్మ, వివాహమైన ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో పట్టుబడిన వ్యక్తికి రిమాండ్

పాతపట్నం ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొరసవాడ గ్రామానికి చెందిన బొమ్మాలి నీలయ్య అలియాస్ కాయ అనే వ్యక్తి శనివారం సారా ప్యాకెట్లతో పట్టుబడ్డాడు. ఆయన్ను పాతపట్నం కోర్టులో హాజరుపరచగా ఈనెల 27 వరకు న్యాయాధికారి రిమాండ్ విధించారని ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు.



ఈ ప్రయాణం.. ప్రమాదం

శ్రీకాకుళం నగరంలో జరుగుతున్న ఓ వివాహ విందు కోసం కొందరు వ్యక్తులు లారీలో పోలాకి నుంచి నరసన్నపేట వైపు శనివారం ప్రయాణమయ్యారు. అయితే, ఓ వృద్ధుడు లారీ వెనుకన వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణించాడు. దీన్ని చూసిన స్థానికులు.. ఇలాంటి ప్రయాణాలు ప్రమాదమని మందలించినా ఆ వ్యక్తి వినలేదు. ఈ దృశ్యం పోలాకి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కూడలి వద్ద శనివారం కనిపించింది.

-పోలాకి

పట్టుమహాదేవి కోనేరును అభివృద్ధి చేస్తాం

- ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


పట్టుమహాదేవి కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్

టెక్కలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్టణానికి మణిహారంగా ఉన్న పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పట్టుమహాదేవి కోనేరును ఆయన పరిశీలించారు. కోనేరు ఆక్రమణలకు గురైందా? తదితర వివరాలు ఆరాతీశారు. ఇన్‌లెట్ ద్వారా మంచినీరు వచ్చేందుకు, ఔట్‌లెట్ ద్వారా నీరు మళ్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అమృత్ సరోవర్ కింద ఏ మేరకు నిధులు కేటాయించారని ఏపీవో బగాది ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్‌ఫెన్సింగ్, వాక్‌వే మార్గం, లైటింగ్, బెంచీలు, పార్క్, క్యాంటీన్, ఇతర సౌకర్యాలు కల్పించాలని, ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. తడిచెత్తతో తయారయ్యే ఎరువులు, పొడిచెత్తతో రీసైక్లింగ్ అయ్యే మార్గాలు వివరించారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. చదువుపై దృష్టి సారించి 21ఏళ్ల తరువాతనే పెళ్లి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కళాశాలలో సీసీ కెమెరాలు, ఎన్‌సీసీ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, డీపీవో భారతీ సౌజన్య, ఎంపీడీవో లక్ష్మీభాయి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


పౌరసరఫరాల గిడ్డంగిని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

నరసన్నపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. స్థానిక ఎంఎల్ఎస్ గోదాము వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. గోదాము ఆవరణలో జేసీ మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం గోదాము తనిఖీ చేసి స్టాకు వివరాలు పరిశీలించారు. బియ్యం తరుగుదలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. ● వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టీవీ బాలమురళీకృష్ణ ఆదేశించారు. ఉర్లాం పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజాత, డాక్టర్ అరవింద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణతో మేలు

- జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య


మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

కాశీబుగ్గ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలన్నీ అభ్యసన కేంద్రాలుగా మార్చి పునర్వ్యవస్థీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, అందులో భాగంగానే క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. శనివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అభ్యసన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 235 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా వాటిని తగ్గించి 170 క్లస్టర్ కాంప్లెక్స్‌లుగా మార్పు చేశామన్నారు. సీఆర్ఎంటీ ఆధ్వర్యంలో 9,391 మంది ఉపాధ్యాయులకు పునర్వ్యవస్థీకరణపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్.శ్రీనివాసరావు, హెచ్ఎం వై.చిన్నంనాయుడు, సీఆర్‌పీ శేషగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓం నమో భగవతే.. వాసుదేవ పెరుమాళ్!

(ఏడో పేజీ తరువాయి)

దేవదాయ శాఖ విఫలమైంది. దీని పురోభివృద్ధికి త్రిదండి చినజీయరు స్వామి నడుం బిగించారు.

పురోభివృద్ధికి జీయర్‌స్వామి ప్రతిన..

జీయర్‌స్వామి 1988లో వేదశాంతి పేరిట యాత్ర చేశారు. వేద అధ్యాపకులు, విద్యార్థులతో శ్రీకూర్మం నుంచి పూరీ వరకు యాత్ర నిర్వహించారు. మార్గ మధ్యలో మందస ప్రాంతానికి వచ్చేసరికి తమ గురువు (చిన జీయర్‌స్వామి గురువైన పెద్ద జీయర్‌స్వామి, తెరికిచర్ల కందాలై గోపాలాచార్యస్వామితో కలిసి ఈ ఆలయంలో రాజాస్థానం స్థానాచార్యులుగా ఆండే తెరికిచర్ల కందాలై రామానుజాచార్యస్వామి వద్ద 1932లో శ్రీభాష్య గ్రంధ అధ్యయనం చేశారు.) త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయరుస్వామి వేదాలు అభ్యసించిన వేద పాఠశాలైన ఈ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ దుస్థితి చూసి ఆయనెంతో ఆవేదన చెందారు. తన గురువు విద్యాభ్యాసం చేసిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. దేవాదాయ శాఖ అనుమతితో 2000 జులై 7న దత్తత తీసుకున్నారు. శ్రీమద్ ఉభయవేదాంతచార్య పీఠం ద్వారా జీర్ణోద్ధారణ చేయించారు. అనంతరం జీయరు శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 2009లో ఆలయాన్ని ప్రాచీన శిల్పకళాకృతులతో ఆవిష్కరించారు. ఆ ఏడాది నుంచి మళ్లీ ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయం దినాదినాభివృద్ధి చెంది లక్షలాదిమంది భక్తులు శ్రీ భూసమేత వాసుదేవ పెరుమాళ్‌ని కొలుచుకునేలా చేశారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- జూనియర్ సివిల్ న్యాయాధికారులు హరిప్రియ, రోషిణి


నరసన్నపేట: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి హరిప్రియ


పాతపట్నం: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రోషిణి

నరసన్నపేట/పాతపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారులు చందక హరిప్రియ, ఎం.రోషిణి అన్నారు. శనివారం నరసన్నపేట, పాతపట్నం కోర్టుల్లో పోలీసులు, న్యాయవాదులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజీకి సిద్ధంగా ఉన్న కేసులను గుర్తించాలన్నారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిరించి రాజీమార్గాన్ని అనుసరించాలన్నారు. రాజీతోనే కేసులు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో పలువురు న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

నిధులిస్తా.. వంతెన నిర్మాణం చేపట్టండి: కలెక్టర్

నందిగాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గొల్లూరు సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై శిథిలమైన వంతెన స్థానంలో కొత్తది నిర్మాణానికి నిధులు ఇస్తానని, పనులు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం సాయం త్రం ఈ వంతెనను ఆయన పరిశీలించారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.39లక్షలతో ప్రతిపాదించినట్లు తెలిపారు. ఆయనవెంట తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో టి.రాజారావు, సర్పంచ్ జీరు రాజేశ్వరి నానీరెడ్డి, వంశధార ఏఈ భాస్కరరావు తదితరులు ఉన్నారు.

6జీ సేవలకు కేంద్ర ప్రభుత్వం కృషి

టెక్కలి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దేశంలో 6జీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని విజయవాడ దూరదర్శన్ కేంద్రం రిటైర్డ్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.రంగనాథం అన్నారు. శనివారం కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థులకు కమ్యూనికేషన్ రంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమర్జింగ్ వైర్‌లెస్, బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీస్, 5జీ అనే అంశంపై అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ రంగంలో భవిష్యత్‌లో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని, విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని వాటిని అందుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు అశోక్‌కుమార్, యుగంధర్‌లు పాల్గొన్నారు.

కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని రద్దు చేయాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ మెంబర్ నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. శనివారం కోటబొమ్మాళిలో సీపీఎం నాయకుడు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కొవ్వాడలో అనువిద్యుత్ కేంద్రం పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనని అన్నారు. వెంటనే ఈ కేంద్రాన్ని రద్దుచాయాలని డిమాండ్ చేశారు.

మిల్లర్ల సమస్యలు పరిష్కరించండి

పలాస, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. తడిసిన ధాన్యం కొనుగోలు తరువాత మిల్లర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. జిల్లా వ్యాప్తంగా రంగుమారిన ధాన్యం, నూకల శాతం ఎక్కువ అవుతున్న కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోయిన రమేష్, కార్యవర్గసభ్యులు ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

హరిపురం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కారానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు తీవ్రంగా కృషిచేస్తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. మందస మండలం హరిపురం హైస్కూల్ ఆవరణలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరి గెలుపునకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కిషోర్‌కుమార్, జయచంద్రారెడ్డి, మందస బాధ్యులు కె.మాధవరావు, దాసరి ఈశ్వరరావు, సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు

నరసన్నపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సత్యవరం కూడలి వద్ద సర్వీసు రహదారిలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఇసుక, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసులు రాత్రి విధులు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ముఖ హాజరు తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు.

రేపటి నుంచి తిలారు రైల్వే గేటు మూసివేత

జలుమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వే గేటును సోమవారం నుంచి మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజనీర్ వేంకటేశ్వర్లు తెలిపారు. ట్రాక్ పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నరసన్నపేట నుంచి పాతపట్నం వైపు వెళ్లే వాహనాలు జమ్ము కూడలి, జర్జంగి మీదుగా, పాతపట్నం నుంచి నరసన్నపేట వెళ్లే వాహనాలు జర్జంగి మీదుగా ప్రయాణం చేయాలన్నారు.

18న ఉచిత వైద్యశిబిరం

పలాసరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కిష్టుపురం గ్రామంలో ఈ నెల 18న గ్లోసంస్థ, కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యులతో బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలాస, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న జార్జ్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థలో ఆరోగ్య కార్యకర్తల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. కనీస అర్హత డిగ్రీ ఉండాలని, కమ్యూనికేషన్‌లో నైపుణ్యత కలిగి ఉద్దానం గ్రామాలకు చెందినవారై ఉండాలని పేర్కొంది. ఎన్‌జీవో రంగంలో కనీసం మూడేళ్లు పనిచేసిన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపింది. అర్హులు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది.

కేసులు పరిష్కరించండి

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేసులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో బంగారు దుకాణాల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, రాత్రివేళల్లో గస్తీ పెంచాలని తెలిపారు. మండలంలో అధికంగా తీరప్రాంతం ఉన్నందున ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.నిహార్, ఏఎస్ఐ జూన్నారావు ఉన్నారు.

రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలి

కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి అన్నారు. శనివారం హరిశ్చంద్రపురం, బోరుభద్ర రైతు సేవా కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్, పట్టాదారు పాసుపుస్తకంతో రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు సేవా సిబ్బంది 11 అంకెలతో కూడిన ఒక నెంబర్ మీకు ఇస్తారని, వాటి ద్వారానే ఇక నుంచి సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు ఎస్.గోవిందరావు, రాళ్లపాటి అప్పారావు, తెలుగు యువత కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏపీపీగా బాబూరావు

హరిపురం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): సోంపేట అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా దువ్వు బాబూరావు(జగన్నాయకులు)ను నియమించారు. ఈయనది మందస మండలం బెల్లుపటియా గ్రామం. గత ఐదేళ్లుగా టీడీపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా సేవలందించారు. ఏపీపీగా తనను నియమించినందుకు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం అశోక్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ల కార్యవర్గం

హరిపురం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వాసుదేవ, కార్యదర్శిగా బి.గిరిజ, ట్రెజరర్‌గా ఎన్.శ్రావన్‌కుమార్‌తో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

యువకుల చొరవతో బియ్యం అక్రమ రవాణాకు చెక్

సంతబొమ్మాళి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను మర్రిపాడు గ్రామ యువకులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. సుమారు రెండు టన్నుల బియ్యాన్ని పట్టుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని యువకులు ఆరోపిస్తున్నారు. కోటబొమ్మాళికి చెందిన ఓ మిల్లరు ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో సదరు మిల్లరు రాజకీయ ఒత్తిడి తీసుకురావడంతో గ్రామ పెద్దలు నచ్చజెప్పడంతో రేషన్ వ్యాన్‌ను యువకులు విడిచిపెట్టారు. దీనిపై కోటబొమ్మాళి సివిల్ సప్లయిస్ డీటీ రామచంద్ర వివరణ కోరగా.. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

నందిగాం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): లఖిదాసుపురం ఉన్నతపాఠశాలను డీఈవో ఎస్.తిరుమలచైతన్య శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల బోధనను పరిశీలించారు. ఉత్తమ ఫలితాల సాధనపై హెచ్ఎం చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయులతో చర్చించారు.